గురుకులం నిర్మాణాలపై ఇంత నిర్లక్ష్యమా?

• ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణాల జాప్యంపై మాజీ ఎమ్మెల్యే కళావతి మండిపాటు



ఏకలవ్య పాఠశాల భవన సముదాయంను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే వి.కళావతి, పార్టీ నాయకులు

భామిని: ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల భవనాల నిర్మాణాలపై ఇంత నిర్లక్ష్యం తగదని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మండిపడ్డారు. భామిని మండల కేంద్రంలో నిర్మాణంలోని ఏకలవ్య మోడల్ స్కూల్ భవనాలను వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి బుధవారం ఆమె పరిశీలించారు. నిర్మాణ పనుల్లో జాప్యంపై సైట్ ఇంజినీర్ రమేష్‌ను వివరాలు అడిగి తెలుసుకుని అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధుల కేటాయింపు జరుగుతున్నప్పటికీ భవన నిర్మాణాలు నత్తనడకన సాగడానికి కారణం ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే అని ఆరోపించారు. సుమారు రూ.12 కోట్లు వ్యయంతో నిర్మిస్తున్న భవనాల్లో 240 మంది విద్యార్థులకు వసతి కల్పించకపోవడం శోచనీయమన్నారు. భామిని ఏకలవ్య పాఠశాల తరగతులను కొత్తూరు మండలం మహాసింగి, సీతంపేట మండలం మల్లి ఆశ్రమ పాఠశాల్లో నిర్వహించడం బాధాకరమన్నారు. ఇరుకైన, కూలేందుకు సిద్ధంగా ఉన్న గదుల్లో విద్యార్థులు అభ్యసన సాగించలేక ఇంటిముఖం పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాత్కాలికంగా భామినిలో వసతి కల్పించలేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ప్రస్తుతం నిర్మాణం పూర్తి చేసుకున్న ఏడు భవనాలల్లో విద్యార్థులకు వసతి ఏర్పాటు చేయాలని కోరారు. వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, ప్రత్యేక ఆహ్వానితులు తోట సింహాచలం, జేసీఎస్ కోఆర్డినేటర్ కె.చంద్రశేఖర్, పార్టీ నాయకులు జీ రమేష్, కే కృష్ణారావు, రొక్కం రమేష్, పి.హరికృష్ణ, వై.పాపినాయుడు, ఎస్.గౌరీష్, కార్యకర్తలున్నారు.

జీఓ 115 రద్దు చేయాలి



భద్రగిరి సీహెచ్‌సీ ఎదుట నిరసన తెలియజేస్తున్న వైద్య సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: జీఓ నంబర్ 115ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ భద్రగిరి సీహెచ్‌సీ వైద్య సిబ్బంది బుధవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా స్టాఫ్ నర్సులు మాట్లాడుతూ.. ఏఎన్‌ఎంలకు ఇంటెన్సిఫైడ్ జీఎన్ఎం పేరుతో నైపుణ్య శిక్షణ ఇచ్చి, వారికి స్టాఫ్ నర్స్ ఉద్యోగాలు ఇచ్చేందుకు జీవో 115ను తీసుకురావడాన్ని తామంతా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఈ జీవోను తక్షణమే రద్దు చేయాలని, కాంట్రాక్టు నర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఇంతవరకు ప్రభుత్వం నుంచి గానీ, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల నుంచి గానీ ఎటువంటి నిర్ణయం రాకపోవడంతో తామంతా ఆందోళన చెందుతున్నామన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన



భామిని పీహెచ్‌సీలో నల్లబ్యాడ్జీ ధరించి విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సంతోషిలక్ష్మి

భామిని: మండలంలోని భామిని, బత్తిలి, బాలేరు పీహెచ్‌సీల్లో వైద్యులు బుధవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 85కి వ్యతిరేకంగా ఏపీ పీహెచ్‌సీడీఏ పిలుపు మేరకు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైనట్లు తెలిపారు. కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించి వైద్యసేవలు అందించామని, అలాంటి పీహెచ్‌సీ వైద్యుల సర్వీస్‌కు అర్థం లేకుండా చేసిన జీఓ 85ను రద్దు చేయాలని కోరారు. ఉన్నత చదువు పీజీకి వెళ్లే అవకాశాలు లేకుండా చేసిన ఈ జీవోను రద్దు చేసే వరకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు.

పేద విద్యార్థినికి ఇంజినీరింగ్‌లో ఉచిత సీటు



విట్ యూనివర్సిటీ నుంచి వచ్చిన జాయినింగ్ లెటర్‌ను ఆషాకు అందజేస్తున్న ప్రిన్సిపాల్ త్రినాథ్

వీరఘట్టం: కార్పొరేట్ ఇంజినీరింగ్ కాలేజీల్లో 35 శాతం సీట్లను ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో చదువుకున్న మెరిట్ విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం నేడు పేద విద్యార్థులకు వరంగా మారింది. వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఇంటర్మీడియట్ ఎంపీసీలో 930 మార్కులతో ఉత్తీర్ణత సాధించిన పేద విద్యార్థిని కొత్తవలస ఆషాకు అమరావతిలోని విట్-ఏపీ యూనివర్సిటీలో బి.టెక్ కంప్యూటర్స్ కోర్సులో ఉచిత సీటు లభించింది. అంతే కాకుండా యూనివర్సిటీయే విద్యార్థినికి ఒక ల్యాప్ టాప్‌ను ఉచితంగా అందించింది. ఇంజినీరింగ్ కోర్సు నాలుగేళ్ల పాటు ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు ఆ కళాశాల డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జాన్ ప్రదీప్ తెలిపారు. ఈ మేరకు బుధవారం విట్ యూనివర్సిటీ నుంచి జాయినింగ్ లెటర్ అందినట్లు జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డీజీఎస్‌వీ త్రినాథ్ తెలిపారు. ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు మాచర్ల కుమారస్వామి ఆ బాలికకు జాయినింగ్ లెటర్‌ను అందజేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



జియ్యమ్మవలస: జోగులడుమ్మలో మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి



వీరఘట్టం: దుర్గారావును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: పట్టణంలోని బాసూరు వారి వీధిలో నివాసం ఉంటున్న బాసూరు శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ బుధవారం పరామర్శించారు. శ్రీనివాసరావు అనారోగ్యంతో మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం తెలిపారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు కడగల వెంకటరమణ, భరత్‌భూషణ్, బాసూరు కాంతారావు, కొంచాడ అరుణ్‌కుమార్ ఉన్నారు.

- **వీరఘట్టం:** మండలంలోని విక్రమపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అలజంగి దుర్గారావు భార్య జ్యోతి ఇటీవల మృతి చెందడంతో బుధవారం ఆ కుటుంబాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పరామర్శించారు. పార్టీ తరపున ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎంపీపీ దమలపాటి వెంకటరమణ, పాలవలస దవలేశ్వరరావు, మాచర్ల వెంకటరమణ ఉన్నారు.
- **భామిని:** భామినికి చెందిన లోపింటి సంజీవ్, అనంతగిరికి చెంది గెల్లంకి ఉమా, పెద్దదిమిలికి చెందిన పాలక సూరజ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బుధవారం పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు టి.సింహాచలం, వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, ఎంపీటీసీ కె.చంద్రశేఖర్, సర్పంచ్ తోగరాన శ్రీను, పార్టీ నాయకులు గెల్లంకి రమేష్, కాగితాపల్లి కృష్ణ, గేదెల మోహన్, బొమ్మాలి సంజీవ్, వై.పాపినాయుడు, సుంకు గౌరీష్, తదితరులు ఉన్నారు.
- **జియ్యమ్మవలస:** ఇటీవల జోగులడుమ్మ, నీచుకవలస గ్రామాల్లో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుటుంబాలను మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి బుధవారం పరామర్శించారు. వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. ఏ అవసరమున్నా తనను సంప్రదించాలని, అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు లోలుగు నారాయణరావు, తదితరులున్నారు.

గణపతికి 108 రకాల నైవేద్యం



108 రకాల ప్రసాదాలను గణపతికి నివేదిస్తున్న భక్తులు

పాలకొండ రూరల్: పట్టణంలో కొలువుదీరిన విఘ్నేశ్వర మండపాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలను భక్తులు వైభవంగా నిర్వహిస్తున్నారు. స్థానిక దక్షిణాముఖ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక మండపంలో స్వామికి 108 మంది దంపతులు 108 రకాల నైవేద్యాలతో, 11,100 గరిక పూసలు, పసుపు కొమ్ములతో బుధవారం విశేష పూజలు చేశారు. అర్చకులు జోష్యుల కూర్మనాథ శర్మ భక్తులు సమర్పించిన మహాప్రసాదాలను స్వామివారికి నివేదించారు. నీలమ్మకాలని, ఆంజనేయ, సత్యసాయి నగర్, టీచర్స్ కాలనీలకు చెందిన భక్తులు, ప్రజా ప్రతినిధులు, మహిళలు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు



బార్నాలవీధి గణేశ్ మండపం వద్ద కుంకుమ పూజలు చేసున్న మహిళలు

వీరఘట్టం: స్థానిక బార్నాలవీధిలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద బుధవారం కుంకుమ పూజలు నిర్వహించారు. అర్చకులు సర్వాజ్యోశ్యుల రమేష్ శర్మ ఆధ్వర్యంలో మహిళలు విఘ్నేశ్వరుడికి భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు చేశారు. అనంతరం భక్తులకు ఉత్సవ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

అన్న సమారాధన



అన్నసమారాధన చేస్తున్న భక్తులు

సీతంపేట: స్థానిక కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గణనాథుని మండపం వద్ద బుధవారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

గణపతి లడ్డూ వేలం

గరుగుబిల్లి: మండలంలోని కొత్తూరు గ్రామంలోని శ్రీరామ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద బుధవారం గణపతి మహాప్రసాదం(లడ్డూ) వేలం నిర్వహించారు. మూడు లడ్డూలు వేలం వేయగా.. గ్రామానికి చెందిన ద్వారపురెడ్డి సింహాచలంనాయుడు రూ.32 వేలకు, యేగిరెడ్డి శ్రీనివాసరావు రూ.29 వేలకు, గొట్టాపు జగ్గునాయుడు రూ.18 వేలకు చెరొక లడ్డూ దక్కించుకున్నారు. అలాగే మండలంలోని ఉల్లిభద్ర గ్రామంలోని రామాలయం వీధిలో గణేష్ యూత్ నిర్వహించిన లడ్డూ వేలంలో రూ.33,333లకు గ్రామానికి చెందిన నక్కర్ల చిన్నారావు కుటుంబ సభ్యులు దక్కించుకున్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు



సుంకిలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

గరుగుబిల్లి: తుఫాను కారణంగా గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండలంలోని సుంకి, సంతోషపురం, తోటపల్లి తదితర గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను బుధవారం ఆమె పరిశీలించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. రక్షిత పథకాలు, మంచినీటి బోర్లు వద్ద మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. రహదారులపై మురుగునిల్వలు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కార్యదర్శులను ఆదేశించారు. ఆమె వెంట ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు, సిబ్బంది ఉన్నారు.

కంపోస్టు తయారీపై దృష్టి సారించాలి



తోటపల్లిలోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ పైడితల్లి

గరుగుబిల్లి: సాలిడ్ వెల్త్ ప్రాసెసింగ్ సెంటర్(ఎస్‌డబ్ల్యూపీసీ)ల ద్వారా వర్మీ కంపోస్టు తయారుచేయాలని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండలంలోని తోటపల్లి, సుంకి గ్రామాల్లో ఉన్న చెత్త సంపద కేంద్రాలను(ఎస్‌డబ్ల్యూపీసీ)బుధవారం ఆమె పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని, అక్టోబర్ 2 నాటికి వర్మీ కంపోస్టును తయారీని ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. వర్మీ కంపోస్టును పంటలకు ఎరువుగా వేసుకోవడం ద్వారా నాణ్యమైన ఆహార ఉత్పత్తులు పొందవచ్చన్నారు. చెత్త సంపద కేంద్రాల ఆవశ్యకత, వర్మీ కంపోస్టు వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆమె వెంట ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

డంపింగ్ యార్డు సమస్య పరిష్కరించాలి



నినాదాలు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పాలకొండ రూరల్: పట్టణంలో సేకరించిన చెత్తను నగర పంచాయతీ కార్యాలయం వద్ద వేయటంతో అక్కడ ఉండే ప్రజలుతో పాటు మార్కెట్‌కు వచ్చేవారు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు సీఐటీయూ నాయకులు దావా రమణారావు మండిపడ్డారు. చెత్తను వేస్తున్న ప్రాంతంలో బుధవారం ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. పరిసరాల పరిశుభ్రతపై నినాదాలు చేశారు. పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో శాశ్వత డంపిగ్ యార్డు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై అధికారులు, ప్రజా ప్రతినిధులు శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కాద రాము, సంజీవి, డి.దుర్గారావు తదితరులున్నారు.

కుడ్డపల్లిలో పొలంబడి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

సీతంపేట: మండలంలోని కుడ్డపల్లి గ్రామంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి శ్రీదేవి పంటల సాగులో అధిక దిగుబడులు పొందేందుకు అవసరమైన సలహాలు, సూచనలను రైతులకు అందించారు. పిలకల కత్తిరింపు ప్రయోగం చేశారు. శత్రు, మిత్రపురుగులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు



ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

భామిని: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ పోటీలను ప్రారంభించారు. మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. కన్వీనర్ శివరాంప్రసాద్ ఆధ్వర్యంలో పీఈటీలు పోటీలను పర్యవేక్షించారు. సీఆర్పీలు టి.ప్రసాద్, చిన్నబాబు, కిశోర్‌కుమార్, సంజీవ్ సహకరించారు. ఎంపికైన విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

మెరుగైన విద్యనందించాలి



మూర్తిగాడిగూడలో విద్యార్థుల చదువులను పరిశీలిస్తున్న డిప్యూటీ ఈవో నారాయుడు

సీతంపేట: గిరిజన విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో మెరుగైన విద్యనందించాలని డిప్యూటీ ఈవో నారాయుడు అన్నారు. మండలంలోని మూర్తిగాడిగూడ, కోతాం, సారా, మల్లి గురుకుల పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల చదువులు పరిశీలించారు. ఆయా సబ్జెక్టులకు సంబంధించి పలు ప్రశ్నలు వేసి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. అనంతరం మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు.

కవితా పోటీల్లో దేవానంద్ ప్రతిభ

గుమ్మలక్ష్మీపురం: జాతీయ కవితా పోటీల్లో గుమ్మలక్ష్మీపురానికి చెందిన పాలక దేవానంద్ ప్రతిభ కనబరిచారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. శ్రీశ్రీ కళావేదిక జాతీయ స్థాయిలో 'జాతి కీర్తి శిఖరం ఎన్టీఆర్' అనే శీర్షికతో కవితా పోటీలు నిర్వహించగా.. అందులో తాను రాసిన కవితకు ప్రశంసలు వచ్చాయన్నారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమాదేవి ప్రశంసాపత్రాన్ని అందజేసినట్లు దేవానంద్ తెలిపారు.

ఒడిశాకు తరలిపోతున్న యూరియా




ఒడిశా గ్రామాలకు తరలిపోతున్న ఎరువుల బస్తాలు

భామిని: భామిని మండలంలోని ప్రైవేటు ఎరువుల డీలర్ల నుంచి యూరియా ఎరువు యథేచ్ఛగా సరిహద్దు ఒడిశా గ్రామాలకు అక్రమంగా తరలిపోతున్నదని బత్తిలి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒడిశాలో యూరియా సరఫరా లేకపోవడంతో ఆంధ్రా యూరియాకు డిమాండ్ పెరిగింది. ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలకు బదులు ప్రైవేటు డీలర్లకు ఎరువులు సరఫరా చేయడంతో వారు ఒడిశాకు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారని మండల కో-ఆప్షన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు విశ్వనాథ్ పట్నాయక్ బుధవారం ఆరోపించారు. స్థానిక అధికారులు పట్టించుకోకపోవడంతో బత్తిలి నుంచి యూరియా సరిహద్దులు దాటుతోందని విమర్శించారు. ఈ మేరకు మండల అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే ప్రైవేటు డీలర్లకు సరఫరా చేసిన ఎరువుల పంపిణీ విధానంపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.



ఐరావతంపై వస్తున్న ఇంద్రుడు



ఆకట్టుకున్న అయోధ్య బాలరాముడు



నిమజ్జనానికి ఊరేగింపుగా వస్తున్న 12 అడుగులు మట్టి గణపయ్య

వైభవంగా నిమజ్జనోత్సవం

వీరఘట్టం: స్థానిక కూరాకులవీధిలో శ్రీకృష్ణా సేవాసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 12 అడుగుల మట్టి గణపతి విగ్రహాన్ని బుధవారం నిమజ్జనం చేశారు. ముందుగా యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్.శర్మయాజీ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మేళతాళాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గణనాథున్ని ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ కళాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు, బళ్ల వేషధారణలు చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు రావడంతో వీరఘట్టం ప్రధాన రహదారి జనసందోహంతో కిక్కిరిసి పోయింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ జి.కళాధర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

నిబంధనలు పాటించాలి

గరుగుబిల్లి: స్కూల్ బస్సులు నడిపే డ్రైవర్లు మోటార్ వెహికల్ చట్టంలోని నిబంధనలు కచ్చితంగా పాటించాలని స్థానిక ఎస్ఐ పి.రమేష్‌నాయుడు అన్నారు. మండలంలోని గొట్టివలస కూడలి వద్ద బుధవారం పలు పాఠశాలలకు చెందిన బస్ డ్రైవర్లకు మోటార్ వెహికల్ చట్టంలోని నిబంధనలపై అవగాహన కల్పించారు. అతి వేగంగా, నిర్లక్ష్యంగా వాహనం నడిపితే చట్టం ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. బస్‌కు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పిల్లలను సురక్షితంగా వాళ్ల ఇంటికి చేర్చే బాధ్యత పాఠశాల యాజమాన్యం, డ్రైవర్లదేనన్నారు.

డిగ్రీ కళాశాలలో వనమహోత్సవం



డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన నర్సరీ

సీతంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. 60 మొక్కలతో నర్సరీ ఏర్పాటు చేసినట్టు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రభాకర్ తెలిపారు. ఎకోక్లబ్ కోఆర్డినేటర్ ఫణికుమారి, శంకరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సన్మానం



రామలక్ష్మి దంపతులను సన్మానిస్తున్న కాలనీ వాసులు

పాలకొండ: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయిని రామలక్ష్మిని స్థానికులు బుధవారం సన్మానించారు. ఇటీవల రామలక్ష్మి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడంతో పాఠశాల సిబ్బంది, కాలనీ వాసులు ఆమెను సన్మానించారు. కౌన్సిలర్ అడపా బాబ్జీ, కాలనీ వాసులు, విద్యాకమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ



వనజ ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డిప్యూటీ ఈవో సుగుణ

జియ్యమ్మవలస: మండలంలోని గిరిజన పాఠశాలలను ఐటీడీఏ డిప్యూటీ ఈవో సుగుణ బుధవారం సందర్శించారు. వనజ కాంప్లెక్స్ పరిధిలోని సీమలవానివలస, బొడ్డవలస, తుమ్మిగూడ, వనజ జీపీ పాఠశాల, జియ్యమ్మవలస, వనజ జీటీడబ్ల్యూఏహెచ్ పాఠశాలను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. బొడ్డవలస పాఠశాలలో రికార్డుల నిర్వహణ సరిగా లేదని, విద్యార్థుల స్పందన బాగా లేదని ఉపాధ్యాయుడు ఎ.భాస్కరరాయుడుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఉపాధ్యాయుడు లెసన్‌ప్లాన్, టీచింగ్ డైరీ మెంటెయిన్ చేయాలని, విద్యాభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యల తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జీసీడీఓ పి.కొండమ్మ, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

రైతు సమస్యలపై వినతి



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

జియ్యమ్మవలస: రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సచివాలయంలో కార్యదర్శికి వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు బుధవారం మెమోరాండం అందజేశారు. వ్యవసాయ పనులు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా ఇంతవరకు రైతులకు పెట్టుబడి సాయం అందించకపోవడంతో రైతులు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలను వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా వారాల పండగ



గరుగుబిల్లిలో అమ్మవారి ఘటాల తిరువీధి

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని గరుగుబిల్లిలో బుధవారం అమ్మవారి వారాల పండగను ఘనంగా నిర్వహించారు. మహిళలు ఘటలతో అమ్మవారి ఆలయానికి చేరుకుని తల్లికి చల్లదనం చేశారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఈ ఏడాది పంటలు బాగా పండాలని, ఎలాంటి కష్టాలు రాకుండా చూడాలని అమ్మవారిని కోరుకున్నారు.